బైక్‌పై నుంచి పడి నాలుగేళ్ల బాలుడి మృతి - 7లో

భారీ కొండ చిలువ హతం - 7లో

27న ఎస్సీ, ఎస్టీ సదస్సు - 7లో

రత్నగిరిపై తొలి ఏకాదశి రద్దీ - 7లో

రెక్కలొస్తే..



కాకినాడ మాస్టర్ ప్లాన్‌లో విమానాశ్రయానికి ప్రతిపాదించిన కరప మండలం పెనుగుదురులోని సాల్ట్ భూములు

- రాష్ట్రంలో ఆరు కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- కాకినాడ-కోనసీమ మధ్యలో ఒకటి నిర్మిస్తామనడంతో జిల్లావాసులకు చిగురిస్తున్న ఆశలు
- కాకినాడ సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన ప్రదేశం
- కరప మండలంలో 216 జాతీయ రహదారిని చేర్చి 1,127ఎకరాల సాల్ట్ భూములు

కరప, జూలై 17: కాకినాడ-కోనసీమ మధ్యలో ఒక విమానాశ్రయం నిర్మిస్తామని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు భోగాపురంలో చేసిన ప్రకటనతో జిల్లావాసులు పెద్దఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయం ఏర్పాటు చేస్తే కాకినాడ, కోనసీమ జిల్లాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం యానానికి మహర్థశ పట్టే అవకాశ ఉంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడకు, కనీస రైలు మార్గం కూడా లేని కోనసీమకు ఈ విమానాశ్రయం మణిహారంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్రంలో కొత్తగా ఆరు విమానాశ్రయాలు నిర్మించాలని, అందులో తొలి ప్రాధాన్యంగా ఇక్కడ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల దృష్టికి ఈ ప్రతిపాదనను తీసుకెళ్లారు. ఇది కార్యరూపం దాల్చితే యానాం, కాకినాడ, కోనసీమ జిల్లా వాసులకు, ఉద్యోగులకు, పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

1,127 ఎకరాల ఉప్పు భూములు విమానాశ్రయానికి అనుకూలం

పెన్సనర్స్ ప్యారడైజ్ కాకినాడకు అతిదగ్గర్లో 216వ జాతీయ రహదారిని చేర్చి కేంద్ర ప్రభుత్వం అధీనంలో 1,127 ఎకరాల ఉప్పు భూములు ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా ఉన్నాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం పెనుగుదురులోని సర్వే నెంబర్ 201లో 566 ఎకరాలు, గురజనాపల్లి పరిధిలోని సర్వే నెంబర్ 202లో 561 ఎకరాలు ఉన్నాయి. కేంద్రం పట్టించుకోకపోవడంతో ఆ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొంతమంది అక్రమార్కులతో సాల్ట్ అధికారులు కుమ్మక్కై ఈ భూముల్లో అనధికారికంగా రొయ్యల సాగు చేస్తున్నారు. పరాధీనంలోకి పోతున్న ఈ భూములను సంరక్షించి విమానాశ్రయానికి వినియోగిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. పైగా భూసేకరణకు వేలకోట్లు వెచ్చించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాకినాడ మాస్టర్ ప్లాన్‌లో కూడా ఇదే విషయాన్ని పొందుపరుస్తూ గుడా, ఆ తర్వాత కుడా అధికారులు విమానాశ్రయానికి ఈ భూములనే ప్రతిపాదించారు. భోగాపురంలో ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత పలువురు నాయకులు విమానాశ్రయానికి ఈ సాల్ట్ భూములను వినియోగించాలని కోరుతూ కేంద్ర పౌరవిమానయానశాఖా మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడికి వినతులు పంపిస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను కలిసేందుకు కూటమి నాయకులు సిద్ధమవుతున్నారు.

'ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఉప్పు భూములను వినియోగించాలి'

వ్యవసాయ, పారిశ్రామిక, ఉపాధి అవసరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే విమానాశ్రయ నిర్మాణానికి పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల పరిధిలోని సాల్ట్‌భూములను వినియోగించాలని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు, బీజేపీ నాయకుడు బుద్దాల సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. పెనుగుదురులో బుధవారం ఎయిర్‌పోర్టు లక్ష్య సాధన సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఈ భూములను సేకరించడంవల్ల ప్రభుత్వానికి రూ.1,200కోట్ల వరకు భారం తగ్గుతుందన్నారు. విలువైన ఈ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ప్రజాప్రయోజనాలకు వినియోగించే దిశగా ఆలోచన చేయాలన్నారు. కాకినాడ నగరానికి సమీపంలో ఈ భూము లు ఉన్నందున ఇక్కడ విమానాశ్రయం నిర్మిస్తే అన్నివర్గాలకు, పారిశ్రామిక, వ్యవసాయరంగాలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కోనసీమ, కాకినాడ జిల్లాలనుంచి కొబ్బరి, చేపలు, రొయ్యలు, ఫార్మా తదితర ఉత్పత్తుల రవాణాకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. త్వరలోనే సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులను, అధికారులను కలిసి ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరతామని వారు స్పష్టం చేశారు. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరుతూ ఇటీవల కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం పంపినట్టు ఏపీ-తెలంగాణ ఐక్య కాపునాడు అధ్యక్షుడు పబ్బినీడి వెంకటేశ్వరరావు తెలిపారు.

మహిళా సమస్యల పరిష్కారానికి

అధిక ప్రాధాన్యం

- బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



బాధ్యతలు చేపడుతున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కాకినాడ క్రైం, జూలై 17: జిల్లావ్యాప్తంగా మహిళలు ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నా వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. విభజనానంతరం ఏర్పడిన కాకినాడ జిల్లాకు మూడో ఎస్పీగా విక్రాంత్‌పాటిల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012, ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన తాను తొలుత చిత్తూరు జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టానన్నారు. అనంతరం విజయవాడ డీసీపీగా పనిచేశానన్నారు. తదుపరి విజయనగరం జిల్లా 5వ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించానన్నారు. తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో సాధారణబదిలీలు జరిగాయని,ఆ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మహిళల సమస్యలు తమ దృష్టికి వస్తే వాటి పరిష్కారానికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. యువత బెట్టింగ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. యువత పోలీసులకు సహకరించి సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పోలీస్‌శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం ప్రజారక్షణకు పారదర్శకతతో పనిచేయాలన్నారు. డ్రగ్స్ గంజాయి వంటి వాటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎంవీజే భాస్కరరావు, ఏఆర్ఏఎస్పీ బి.సత్యనారాయణ, ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి, ఎస్బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

నైరుతి.. ఆశాజనకం

- రెండునెలలుగా అధిక వర్షపాతం నమోదు
- ఖరీఫ్‌కు మరింత ఊతం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



వర్షాలు సమృద్ధిగా కురవడంతో పిఠాపురంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న వరినారుమళ్లు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 17: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కాకినాడ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలో ఖరీఫ్‌సాగు పనులు ఊపందుకుంటున్నాయి. గతనెలలో జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం 112.8 మిల్లీమీటర్ల కురవాల్సి ఉండగా 210.2 మిల్లీమీటర్లు శాతం నమోదైంది. ఈనెలలో ఇప్పటివరకు జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం 201.4 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 283.1 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లాలో ప్రధానంగా కోటనందూరు మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో 82.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 396.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. గొల్లప్రోలు మండలంలో జూన్ నెలలో 76.3 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 112.5 మి.మీ. నమోదైంది. ఈనెలలో 137.8 మి.మీ.కి 162.3 మి.మీ. నమోదైంది.

15చోట్ల అధికం.. ఆరు చోట్ల సాధారణం

ఈ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో 15 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. సామర్లకోట, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, పెదపూడి, కరప, కాజులూరు, తాళ్లరేవు, కోటనందూరు, తుని, రౌతులపూడి, శంఖవరం, ఏలేశ్వరం, జగ్గంపేట, తొండంగి, గండేపల్లి మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. పిఠాపురం, యూ.కొత్తపల్లి, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాల్లో సాధారణం నమోదైంది.

90వేల హెక్టార్లలో వరిసాగు

కాకినాడ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 90వేల హెక్టార్లలో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. ఒకవైపు వర్షాలు కురవడంతోపాటు కాల్వల ద్వారా వచ్చే నీటిని విడుదల చేయడంతో వరిసాగుకు లైన్ క్లియర్ అయ్యింది. జిల్లాలో 86వేల హెక్టార్లలో వరిసాగు చేయాలని నిర్ణయించారు. 187 హెక్టార్లలో మొక్కజొన్న, 764 హెక్టార్లలో అపరాలు, 816 హెక్టార్లలో చెరకు, 1908 హెక్టార్లలో పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిలో ఎంటీయూ 7029, ఎంటీయూ 1318, బీపీటీ 5204, ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1064, 1061, 1121, 3626 రకాల విత్తనాలతో ఆకుమడులు తయారు చేస్తున్నారు. ఎస్‌ఎల్‌ఆర్ 4008, ఆర్ఎస్‌ఆర్ 15048, ఆర్‌పీ బయో 226, సాధన, స్వర్ణ, ఓమ్ సాయి, అమూల్య అంకుర సోనా రకాలను కూడా ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు నిర్వహిస్తే

కఠిన చర్యలు

- తవ్వకాలపై నిఘా పెట్టండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

గండేపల్లి, జూలై 17: అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరించారు. గండేపల్లి మండలం సూరంపాలెం దగ్గర ఉన్న రామేశంపేట గుండ్లమెట్ట ప్రాంతాన్ని రెవెన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్‌శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. గుండ్లమెట్ట ప్రాంతంలో క్వారీలో తవ్వకాలు, అసైన్డ్, జిరాయితీ భూముల వివరాలు, గతంలో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు, అక్రమంగా తరలిస్తున్న మైనింగ్ వంటి వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గండేపల్లి, ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల్లో అనుమతులు ఉన్న క్వారీలతోపాటు అనుమతులు లేని క్వారీల్లో కూడా అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి సంబంధించి రెండురోజులుగా కొన్ని వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. ఇసుక కోసం పకడ్బందీగా ఎలా వ్యవహరిస్తున్నామో గ్రావెల్‌తవ్వకాలపై కూడా ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గండేపల్లి మండలానికి చెందిన గుండ్లమెట్ట ప్రాంతంలో 234 ఎకరాలకుగాను 216 ఎకరాలు అసైన్డ్ భూములు కాగా మిగిలినవి జిరాయితీ భూములుగా ఉన్నాయన్నారు. 2021-22 సంవత్సరం వరకు 3.45లక్షల క్యూబిక్‌మీటర్ల గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పనులకు మినహా ఇతర పనులకు గ్రావెల్ తవ్వకాలకు తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి వీల్లేదని, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రెవెన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్‌శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకు తవ్వకాలు జరిగాయి. కలెక్టర్ వస్తున్నట్లు సమాచారం రావడంతో గ్రావెల్ మాఫియా అప్రమత్తమై ఎక్స్‌కవేటర్లు, లారీలను గుట్టుచప్పుడు కాకుండా వెనువెంటనే తరలించేశారు. పరిశీలనలో ఆయన వెంట జిల్లా గనులశాఖ డీడీ ఈ.నరసింహరెడ్డి, జిల్లా విజిలెన్స్ నిఘా విభాగం సురేష్ రెడ్డి, గండేపల్లి, పెద్దాపురం తహసీల్దార్లు జె.చిరంజీవి, ఎస్.శ్రీనివాసరెడ్డి, గండేపల్లి ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ ఉన్నారు.



గండేపల్లి మండలం రామేశ్వరంపేట గుల్లమెట్టను పరిశీలిస్తున్న కలెక్టర్

టిడ్కో గృహాలు

లబ్ధిదారుల పాలిట శాపాలు

హౌసింగ్ ఫర్ ఆల్ స్కీమ్‌లో భాగంగా పీఎంఈవై, ఎన్టీఆర్ కాలనీ లబ్ధిదారుల కలలకు మోక్షం కలగనుంది. ఐదున్నరేళ్ల నిరీక్షణ తర్వాత త్వరలో సొంత ఇళ్లల్లోకి గృహప్రవేశాలు చేస్తామనే ఆశను జీప్లస్-3 గృహలబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ భవనాలను అప్పట్లోనే సామూహిక గృహ ప్రవేశాలు పేరిట ఉమ్మడి తూర్పు జిల్లాలోని తొమ్మిది మున్సిపాల్టీలు, రెండు నగరపాలకసంస్థల్లో ప్రారంభ కార్యక్రమాలు చేపట్టారు. ఇదే సమయంలో ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో ఆ ఫ్లాట్‌లను లబ్ధిదారులకు నేరుగా స్వాధీనం చేసే ప్రక్రియ నిలిచిపోయింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఫ్లాట్‌లను లబ్ధిదారులకు స్వాధీనం చేయకుండా మోకాలడ్డింది. ఈ పథకంలో అక్రమాలు జరిగాయని, వాటిపై రివర్స్ టెండరింగ్ చేయాలని ఆరోపిస్తూ పంపిణీ చేయకుండా అడ్డుపుల్ల వేసింది. మూడున్నరేళ్లపాటు వైసీపీ ప్రభుత్వంపై లబ్ధిదారులు ఎన్నిసార్లు విన్నవించినా కనికరించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై వారు ఆశలు పెట్టుకున్నారు.



సామర్లకోటలో టిడ్కో గృహ సముదాయాలు

- జిలాల్లో మున్సిపాల్టీల్లో ఐదేళ్లుగా పంపిణీ పూర్తి కాని టిడ్కో గృహ సముదాయాలు
- వైసీపీ హయాంలో బ్యాంకు రుణాల లింకులు
- రుణాలకు వడ్డీల భారం
- కూటమి ప్రభుత్వం రాకతో నెరవేరనున్న కలల సౌధం

సామర్లకోట, జూలై 17: 2019లోనే లబ్ధిదారులు లక్ష రూపాయల చొప్పున తమవంతు వాటా ధనాన్ని చెల్లించారు. అయినా వైసీపీ ప్రభుత్వం అప్పట్లో బ్యాంకు రుణాలకు ముందుకు రావాల్సిందేనని ప్రకటించి అలా బ్యాంకులకు వచ్చి రుణపత్రాలపై సంతకాలు చేసినవారికే రిజిస్ట్రేషన్ అంటూ ప్రకటన చేసింది. మున్సిపల్ కార్యాలయాలకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రోజుల తరబడి తిప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశాక ఫ్లాట్‌లను అప్పగించాలని లబ్ధిదారులు ఉద్యమాలు చేసిన తర్వాత వైసీపీ ప్రజాప్రతినిధులతో అట్టహాసంగా ఫ్లాట్‌లను ప్రారంభించినట్లు కార్యక్రమాలు చేశారు. తీరా వాటివద్ద ఎటువంటి మౌలిక సదుపాయాలు చేపట్టకుండానే పునఃప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం కొందరు లబ్ధిదారులకు ఈ ఫ్లాట్‌లను అప్పగించారు.

వైసీపీ హయాంలో బ్యాంకు రుణాల పేరిట తీసుకున్న సంతకాల కారణంగా రుణాలకు వడ్డీల భారం పడడంతో బ్యాంకులనుంచి నోటీసులు అందుకోవాల్సి వస్తోందని ఫ్లాట్‌ల్లో నివసిస్తున్న లబ్ధిదారులు వాపోతున్నారు. బ్యాంకు రుణాలపై సంతకాలు చేసిన మరికొందరు సైతం తాము ఇంకా ఫ్లాట్‌లోకి వెళ్లకుండానే నెలవారీ చెల్లింపులు చెల్లించాలని, వడ్డీ కూడా చెల్లించాలని బ్యాంకు నోటీసుల అందుకోవాల్సి రావడంతో లబోదిబోమంటున్నారు. ఒక్కొక్క ఫ్లాట్‌పైనా నెలకు రూ.2,500 నుంచి రూ.3,000 చొప్పున చెల్లించాల్సి రావడంతో ఇప్పటికే తమవంతు వాటా ధనం చెల్లించేందుకు చేసిన అప్పుల భారం ఒకవైపు, బ్యాంకు రుణభారం, ఆపై వడ్డీల భారంతో తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని పలువురు వాపోయారు. బ్యాంకు ఒత్తిళ్లు తీవ్రతరం కావడంతో రెండురోజులక్రితం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వద్దకు పలువురు లబ్ధిదారులు వెళ్లి తమగోడు విన్నవించుకున్నారు. రూ.లక్ష చెల్లించిన తమకు ఐదున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నరకం చూపించిందని వాపోయారు. జిల్లావ్యాప్తంగా మిగిలిన అన్ని మున్సిపాల్టీల పరిధిలో టిడ్కో లబ్ధిదారులకూ ఇదే రీతిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. కూటమి ప్రభుత్వం రాకతో తమ ఇళ్లు స్వాధీనపరుస్తారని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల ఊబిలో లబ్ధిదారులు

వైసీపీ ప్రభుత్వం జీ ప్లస్ 3 లబ్ధిదారులనుంచి వాటా ధనంగా బ్యాంకు రుణాల రూపంలో రూ.40కోట్ల మేర వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకుంది. బీ కేటగిరీలోను, సీ కేటగిరిలోను లబ్ధిదారులనుంచి రుణాల సేకరణల ప్రక్రియకు దరఖాస్తులు చేయించి ప్రతిఒక్కరి నుంచీ మూడున్నర లక్షల వరకూ లబ్ధిదారులతో బ్యాంకర్ల నుంచి రుణాలు పొంది ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకుంది. రెండేళ్లలో భవన నిర్మాణలను పూర్తి చేసి అందిస్తామని వైసీపీ ప్రభుత్వం అప్పట్లో ఇచ్చిన హామీ మాత్రం నెరవేరలేదు. కానీ ఇటు లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇతర రుణాలు సైతం పొందేందుకు అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మూడు విభాగాలుగా జీ ప్లస్-3 నిర్మాణాలు

పీఎంఈవై, ఎన్టీఆర్ కాలనీలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడు మున్సిపాల్టీలు, రెండు నగరపాలక సంస్థల్లో 23,400 లబ్ధిదారులకు ఫ్లాట్‌లుగా గృహాలను నిర్మించారు. కాకినాడ జిల్లాలో సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని మున్సిపాల్టీలతోపాటు కాకినాడ నగరపాలక సంస్థల పరిధిలో 7,288మంది లబ్ధిదారులకు ఫ్లాట్‌లుగా గృహాలను నిర్మించారు. ఈ నిర్మాణాలను మూడు కేటగిరీలుగా విభజిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ కేటగిరిలో రూ.500 లబ్ధిదారుడి వాటాతో 300 చదరపు అడుగుల నివాస గృహాన్ని, బీ కేటగిరిలో రూ.50వేల లబ్ధిదారుడి వాటాతో 350 చదరపు అడుగుల భవనాన్ని, సీ కేటగిరీలో రూ.లక్ష లబ్ధిదారుని వాటాతో 430 చదరపు అడుగుల డబుల్ బెడ్ రూమ్ నివాస గృహా న్ని ఇచ్చేందుకు నిర్ణయించారు. ఏ కేటగిరీలో భవనాలను ఉచితంగా లబ్ధిదారు లకు ఇవ్వగా బీ, సీ కేటగిరీల్లో వారి సబ్సి డీపోనూ మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణాన్ని పొంది చెల్లించాల్సి ఉంది.

ఈఎంఐల ఒత్తిడి

2019 ఎన్నికల సమయంలో టిడ్కో లబ్ధిదారులు ఎవరికి పైసా కట్టాల్సిన పనిలేదంటూ హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక ఆ ఊసే ఎత్తలేదు. అప్పటికే అగ్రిమెంట్‌లు పూర్తి చేసుకున్న ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకులనుంచి ఈఎంఐల ఒత్తిడి ఎక్కువైంది. తాము ఇటు ఇల్లు సొంత చేసుకోలేదన్న బాధ ఓవైపు, అద్దెలు చెల్లించలేక మరోవైపు నలిగిపోతున్న లబ్ధిదారులకు గోరుచుట్టుపై రోకలిపోటులా ఈఎంఐలు చెల్లించాలనే ఒత్తిడి పెరగడంతో అధికారులవద్దకు పరుగులు తీశారు. వారు ఏం చెప్పాలో తెలియక చేతులెత్తేయడంతో ఏం చేయాలో తెలియక గందరగోళంలో ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో వారి సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఏర్పడింది.

శోకతప్త హృదయాలతో..

మొహర్రం సందర్భంగా రక్తం చిందించిన ముస్లింలు

మాతం నిర్వహించి అమరవీరులకు నివాళులు



నగరంలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

మామిడికుదురు, జూలై 17: కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన ఇమామ్ హుస్సేన్, అతని 72 మంది పరివారానికి రక్త తర్పణం చేస్తూ ముస్లింలు నిండు శోకంతో బుధవారం మొహర్రం నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ అమరత్వం పొందిన రోజులను పురస్కరించుకుని ముస్లిం భక్తులు కత్తులు, బ్లేడులు, గొలుసులతో హుస్సేన్ హుస్సేన్ అంటూ తమ శరీరాన్ని గాయపరుచుకుని రక్తం చిందిస్తూ మాతం నిర్వహించి వారికి ఘన నివాళులర్పించారు. మొహర్రాన్ని పురస్కరించుకుని నగరం, మామిడికుదురు గ్రామాల్లో 40 పంజాల నుంచి పీర్లు, గుమ్మటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ నిండు శోకంతో ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి అంజలి ఘటించారు. మత ప్రబోధకుడు సయ్యద్ అలీజాఫరీ పవిత్ర యుద్ధ భూమిలో ఇమామ్‌హుస్సేన్, అతని పరివారం మరణించిన తీరును భక్తులకు వివరించగా భక్తులు గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. నగరం మంజిలే కర్బలా నుంచి పెదపంజీష వరకు రక్తం చిదిస్తూ మాతం నిర్వహించారు. పెదపంజీషలో ఇమామ్‌హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన సంఘటనను మజ్లిస్ రూపంలో వివరించి అనంతరం షహదత్ మజ్లిస్ జరిగింది. అనంతరం నగరంలోని పీర్ల చెరువులో పీర్లను శాంతింప చేశారు. మొహర్రం కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని గుమ్మటాన్ని మోసి పీర్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. రాష్ట్రం నలుమూలలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమానే హుస్సేనీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



మొహర్రం సందర్భంగా పీర్లు ఊరేగిస్తున్న ముస్లిం భక్తులు



ద్రాక్షారామలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

నిండు శోకంతో..

ద్రాక్షారామ,జూలై 17: రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో బుధవారం మొహర్రంను ముస్లింలు నిండుశోకంతో జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమాం హుస్సేన్ సంతాపదినాలు బుధవారం సాయంత్రంతో ముగిసాయి. ఈనెల 7న నెలవంక దర్శనంతో సంతాప దినాలు ప్రారంభించారు. 11 రోజుల పాటు ముస్లింలు సంతాప దినాలు నిండు శోకంతో జరుపుకున్నారు. త్యాగాలను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇమాం హుస్సేన్ వీరమరణం పొందిన రోజైన మొహర్రం రోజు ఉదయం ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. పెద్ద మసీదు సెంటర్ నుంచి హజరత్ అబ్బాస్ రోడ్డు వరకు అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ తమ వీపుపైన చాతిపైన, శిరస్సుపైన గాయాలు చేసుకుని మాతం(రక్తతర్పణం) చేసి ఇమాం హుస్సేన్‌పై భక్తిని చాటుకున్నారు. మొక్కుబడులు సమర్పించారు. పీరులను చెరువు వద్దకు తీసుకువెళ్లి కడిగి శాంతింపచేశారు. కర్ణాటక నుంచి వచ్చిన అష్టర్ అబేది సాహెబ్ మజ్లిస్ బోధించారు. మంగళవారం రాత్రి తల్లి పీరు ఊరేగింపు ప్రధాన ఘట్టంగా జరిగింది.



ముత్యాలమ్మతల్లికి సారె సమర్పణ

కడియం, జూలై 17: వేమగిరి గ్రామస్థుల ఆడపడుచుగా, గ్రామదేవతగా, భక్తుల పాలిట కల్పవల్లిగా పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ వారికి ఆషాఢమాసం సందర్భంగా బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముత్యాలమ్మ దిబ్బ మీద ఉన్న ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, 200 కిలోల స్వీట్లు సమర్పించారు. పురవీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ఇద్దరు యువకుల అరెస్టు

రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో బాలికను లొంగదీసుకొని శారీరక వాంఛ తీర్చుకున్న యువకుడితో పాటు అతడికి సహాయం చేసిన స్నేహితుడిని కూడా టూటౌన్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరు పరిధిలో నివసిస్తున్న ఓ కుటుంబంలోని 15 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. నాలుగు నెలలుగా ప్రేమ పేరుతో తూము ముత్యాలరావు(ముత్యాలు) అనే యువకుడు వెంటపడుతున్నాడు. పరిచయం ఏర్పడి ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బయటికి వెళ్దామంటూ ఆ బాలికను ఒప్పించాడు. ఈ నెల 15న స్కూలు నుంచి ఆ బాలికను స్నేహితుడు గుత్తుల వీరబ్రహ్మం(వీరబాబు)తో కలిసి బైక్‌పై వేమగిరిలోని తన ఇంటికి తీసుకెళ్లారు. వీరబ్రహ్మం వెళ్లిపోగా..ఆ బాలికకు మాయమాటలు చెప్పి ముత్యాలు లొంగదీసుకొని శారీరక వాంఛ తీర్చుకున్నాడు. సాయంత్రం ఆమెను ఇంటి సమీపంలో వదిలి వెళ్లాడు. బాలిక ప్రవర్తనలో మార్పును గమనించి తల్లిదండ్రులు ప్రశ్నించగా అఘాయిత్యం బయట పడింది. వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. పోక్సో కేసు నమోదు చేసి ముత్యాలుతో పాటు అతడికి సహకరించిన వీరబ్రహ్మాన్ని అరెస్టు చేశామని.. సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ పేర్కొన్నారు. 2021లో ఒక హత్యా నేరం కేసులో ముత్యాలు బెయిల్‌పై ఉన్నాడన్నారు. అతడిపై రాజానగరం పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ కూడా ఉందని డీఎస్పీ వివరించారు.

అధ్యాపకునిపై పోక్సో కేసు

అడ్డతీగల, జూలై 17: అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకునిపై పోక్సో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. అదే కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణ రావడంతో కేసులు నమోదు చేశామన్నారు. తనను వేధిస్తున్నట్లు సదరు విద్యార్థిని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిందన్నారు. దీనిపై చింతూరు ఏఎస్పీని విచారణ అధికారిగా జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ నియమించినట్లు సీఐ తెలిపారు.

పాదగయలో నందీశ్వరునికి పూజలు



నందీశ్వరునిపై ఉత్సవమూర్తులు కొలువైన దృశ్యం

పిఠాపురం, జూలై 17: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువై ఉన్న నందీశ్వరునికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలిఏకాదశి సందర్భంగా నందీశ్వరుడికి పుష్పాలు, వస్త్రాలతో విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నందీశ్వరునిపై ఆసీనులు చేశారు. భక్తులు నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఎస్పీ పూజలు



ఎస్పీకి ప్రసాదం అందిస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జూలై 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్ బుధవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో కృష్ణారావు స్వామివారి ప్రసాదం అందించారు.

రత్నగిరిపై తొలి ఏకాదశి రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

అన్నవరం, జూలై 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినం, ప్రభుత్వ సెలవు దినం కావడంతో భక్తులతో రద్దీ నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి స్వామిని దర్శించి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు వేచి ఉన్నారు. బుధవారం ఒక్కరోజు సుమారు 3 వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షలు ఆదాయం సమకూరింది.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం,జూలై 17: ఉపనది ఇంద్రావతి నుంచి వరద ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో ఎగువ నుంచి వచ్చి చేరే ప్రవాహాన్ని అంచనా వేస్తూ కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా 93244 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.65 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4 వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

నిలకడగా ఆర్.నారాయణమూర్తి ఆరోగ్యం

రౌతులపూడి, జూలై 17: సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులు నుంచి హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి బంధువులు, అభిమానులు నారాయణమూర్తి సొంత గ్రామం మల్లంపేట చేరుకుని ఆయన ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. దీంతో సోదరుడు రెడ్డి బుల్లాబ్బాయి మాట్లాడుతూ ఆర్.నారాయణమూర్తి పేగు సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో ఉన్నారని ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



మహావిష్ణువుకు పూజలు

సామర్లకోట, జూలై 17: ఆషాఢమాసం తొలి ఏకాదశి మహాపర్వదినం సందర్భంగా పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మహావిష్ణువు, లక్ష్మీదేవి అమ్మవార్లకు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ విశేష అభిషేక పూజలు నిర్వహించారు. పుష్పార్చన పూజలు అనంతరం స్వామి వారిని, అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం వెలుపల గల భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేటి నుంచి డీఎల్ఎంటీలకు శిక్షణ తరగతులు

సామర్లకోట, జూలై 17: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో డీఎల్ఎంటీలకు ఈ నెల 18 గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం విలేకరులతో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణా తరగతులు నిర్వహించనుండగా 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు బ్యాచ్‌లుగా విభజించి నిపుణులు శిక్షణ ఇస్తారని ఈ సందర్భంగా చెప్పారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఈ శిక్షణా తరగతులకు హాజరై వివిధ అంశాలను వివరిస్తారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చెప్పారు.

బైక్‌పై నుంచి పడి నాలుగేళ్ల బాలుడి మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

రెండు కుటుంబాల్లో పెను విషాదం

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



రియాన్స్ మృతదేహం



రియాన్స్ (ఫైల్‌ఫొటో)

కరప, జూలై 17: దైవదర్శనానికి వెళ్లి ఆనందంగా తిరిగొస్తున్న ఆ రెండు కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కరప మండలం వేళంగి-కూరాడ రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం మండలం ఎదురేశ్వరం గ్రామానికి చెందిన కర్రి సూర్యభాస్కర్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠించిన వారాహి అమ్మవారిని దర్శించుకునేందుకు బుధవారం అతని భార్య అలేఖ్య, కుమారుడు రియాన్స్(4), సోదరి కర్రి ధనలక్ష్మి, ఆమె కుమారుడు 15 ఏళ్ల స్వప్నిత్‌రెడ్డిలతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. వారాహిమాత దర్శనం ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కూరాడ రైల్వే గేటు దాటాక మోటర్‌సైకిల్ డ్రైవ్ చేస్తున్న కర్రి ధనలక్ష్మి తాటి దుంగలు లోడుతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసింది. అయితే వర్షం పడి బురదతో నిండిన గొయ్యిని తప్పించబోయి ఆమె బండితో సహా రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇదే బండిపై ఉన్న సోదరుడి కుమారుడు రియాన్స్ తలకు తీవ్రగాయం కాగా, ధనలక్ష్మి, ఆమె కుమారుడు స్వప్నిత్‌రెడ్డిలకు నడుము, రిబ్స్, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. రియాన్స్‌ను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. క్షతగాత్రులు ధనలక్ష్మి, స్వప్నిత్‌రెడ్డిలు కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కళ్ల ముందు కొడుకు మృతిచెందడంతో తట్టుకోలేని సూర్యభాస్కర్‌రెడ్డి, అలేఖ్య దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

లోవ దేవస్థానంలో విశేష పూజలు



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం



లక్ష తులసి అర్చన



ఆలయంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

తుని రూరల్,జూలై 17: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని తొలి ఏకాదశి పర్వదినాన అమ్మవారికి విశేష పూజాధి కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఆలయంలో ముందుగా కైలాస గణపతి స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించి ప్రధాన ఆలయంలో తలుపులమ్మ అమ్మవారికి లక్ష తులసి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

తలుపులమ్మ అమ్మవారి సేవలో ముమ్మిడివరం ఎమ్మెల్యే

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ దేవస్థానంలో ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బారాజు (బుచ్చిబాబు) అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా పూజలు అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

కలెక్టర్ మాధవీలత అక్రమాలపై విచారణ జరపాలి

రాష్ట్ర ప్రభుత్వానికి బర్రే ఆనంద్ కుమార్ ఫిర్యాదు



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17: తూర్పుగోదావరి జిల్లాకు తొలి కలెక్టర్ గా పనిచేసిన డాక్టర్ మాధవీలత ఒక కలెక్టర్‌గా కాకుండా వైసీపీ కార్యకర్తగా విధులు నిర్వర్తించడంతో ఆమె అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరపాలని స్వతంత్ర జనసా(రిపబ్లిక్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలత చేసిన అవినీతి, అక్రమాలపై సీఎంకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. రాజానగరం మండలంలో శ్రీకృష్ణపట్నంలో సుమారు 89 ఎకరాల సీలింగ్ భూమి ఉందని అది నిరుపేదలకు చెందాల్సిన భూమి అని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని అయినప్పటికి ఆ సర్వే నెంబర్లను బ్లాక్‌లో పెట్టడం తప్ప అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని , తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని పేదలకు పంచాలని 2022 జూన్ 6వ తేదీన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కి వెళ్లి ఆధారాలతో సహ ఫిర్యాదు చేశానని చెప్పారు. అయితే కలెక్టర్ ప్రభుత్వ సీలింగ్ భూములను కేవలం వారం రోజులకే ప్రైవేటు వ్యక్తి ధారాదత్తం చేసే విధంగా మొత్తం సర్వే నెంబర్లను బ్లాక్‌లో నుంచి తీయించేశారని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసిందని అందువల్ల తక్షణమే విచారణ చేయాలని కోరుతున్నామన్నారు. విస్సాకోటి శ్రీను, విజ్జిన వీర్రాజు, కొత్తపల్లి మహేష్, విజ్జిన రాంబాబు, డేగపాటి ప్రశాంత్ కుమార్, వేమవరపు రాజు, కాకి హనుమంతరావు, వందే లక్ష్మణరావు పాల్గొన్నారు.

భారీ కొండచిలువ హతం




జగ్గంపేట రూరల్,జూలై 17: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని కాండ్రేగుల గ్రామంలో కామర కొండపై 15 అడుగుల కొండ చిలువను మేకల కాపర్లు హతమార్చారు. గ్రామానికి చెందిన కొంత మంది కామర కొండపై మేకలు మేపుతుండగా అకస్మాత్తుగా కొండచిలువ ఒక మేకను చుట్టుకుని తినేందుకు ప్రయత్నించింది. మేకల అరుపులు విన్న మేకల కాపర్లు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మేకను మింగేందుకు కొండ చిలువ మేకను చుట్టుముట్టింది. ఇది గమనించిన స్థానికులు మేకల కాపర్లు ఆ కొండ చిలువను కత్తులతో హతమార్చారు. మేక కొండచిలువ దాడిలో చనిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చారు.

అదుపు తప్పిన ఐషర్ వ్యాన్

డ్రైవర్ మృతి

ప్రత్తిపాడు, జూలై 17: ప్రత్తిపాడు పాదాలమ్మ తల్లిగుడి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తుని నుంచి రాజమండ్రి వైపు వస్తున్న ఐషర్ వ్యాన్ స్థానిక పాదాలమ్మ తల్లి గుడి వద్దకు రాగానే అదుపు తప్పి గోతులో పడి కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో బొమ్మూరుకు చెందిన డ్రైవర్ బొంతు నాగేశ్వరరావు(49)కు తలకు బలమైన గాయాలు కావడంతో వ్యాన్‌లోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న ఎస్సీ, ఎస్టీ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూలై 17: భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ప్రాథమిక విధులపై అందరికీ అవగాహన కల్పించేందుకు ఈనెల 27న కాకినాడలోని డీ కన్వెన్షన్ హాల్‌లో 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ సదస్సు నిర్వహిస్తామని అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ తెలిపారు. కాకినాడ ఇంద్ర పాలెం లాకుల వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించి సదస్సు పోస్టర్ ఆవిష్క రించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లకు దగ్గర వుతున్నా దళిత, గిరిజన ప్రజలు పూర్తిస్థాయిలో అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు పొంద లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో దళిత, గిరిజన సామాజికవర్గాల ప్రాధాన్యం సంపాదించుకునేలా అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ పదేళ్లుగా విశేష కృషి చేస్తో ందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ మూర్తులు, న్యాయవాదులు, విశ్రాంత వైద్యనిపుణులు, సమాజం పట్ల అవగాహన కలిగి మార్పుకోసం తపించే వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారని ఏఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరామకృష్ణ తెలిపారు. దళిత సత్తా నాయకులు బచ్చల కామేశ్వరరావు, పిల్లి శివకుమార్ పాల్గొన్నారు.



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం,జూలై 17: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం ఉరకలేస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఏజెన్సీ వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురవడంతో జలపాతం ఉరకలేస్తుంది. సుమారు 50 అడుగులు పై నుంచి వేగం నీటి ప్రవాహం కిందకు పడుతుంది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద సరదాగా గడిపేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. బుధవారం సెలవు కావడంతో జలపాతానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద పర్యాటకుల సందడి కనిపించింది.

రేపు శాకంబరి అలంకరణ

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 17: ఆషాఢ మాసం పురస్కరించుకుని దేవాలయంవీధిలోని బాలాత్రిపురసుందరీ సమేత భీమేశ్వరస్వామి (పెద్దశివాలయం)ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ చేస్తున్నామని ఈవో రాపర్తి రామేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ స్థలాల గుర్తింపునకు సర్వే : ఆర్డీవో

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



మోహన్‌నగర్‌లో ప్రభుత్వ, ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కిషోర్

పిఠాపురం, జూలై 17: ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆదేశించారు. పిఠాపురం మోహన్‌నగర్‌లో పార్కు, ఇతర సామాజిక అవసరాల కోసం ప్రత్యేకించిన ఖాళీస్థలాలు, ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్నుపడిందని, గతంలో కొన్ని స్థలాలు కబ్జాకు గురయ్యాయని, వీటిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయిన వార్తా కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కిషోర్, మున్సిపల్ కమిషనరు కనకారావు తదితరులు మోహన్‌నగర్‌లో పర్యటించారు. అక్కడ ఉన్న భూములు, ఖాళీస్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ భూమి సర్వే చేయించి హద్దులు గుర్తించాలని ఆర్డీవో సూచించారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, వాటి పరిస్థితి, కోర్టు కేసులు, గతంలో వీటికి ఏమైనా పట్టాలు జారీ చేశారా, రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో గత పదేళ్లల్లో జరిగిన క్రయ, విక్రయాల వివరాలు తదితర అంశాలను లోతుగా విచారించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నారు. వారి వెంట పురపాలక సంఘ టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, కౌన్సిలరు రాయుడు శ్రీనివాసరావు, అధికారులు ఉన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణానికి డంపింగ్‌యార్డు నిమిత్తం సేకరించ తలపెట్టిన చేబ్రోలు పరిధిలోని 3.78 ఎకరాల భూమిని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ భూములు ఇచ్చేందుకు గతంలో రైతులు అంగీకరించారు. ఆయన వెంట గొల్లప్రోలు తహశీల్దారు ఉదయభాస్కర్ తదితరులు ఉన్నారు.

కేన్సర్ శస్త్రచికిత్సా విభాగానికి పరికరాల వితరణ



రూఫ్ టాప్‌లైట్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ

జీజీహెచ్(కాకినాడ), జూలై 17: కాకినాడ జీజీహెచ్ ఆంకాలజీ (కేన్సర్) విభాగ ఆపరేషన్ థియేటర్‌కు అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రులు రూఫ్ టాప్‌లైట్ తదితర విలువైన పరికరాలను డీఎంఈ డాక్టర్ వీఎస్‌వీఎల్ నరసింహానికి అందజేశారు. క్యాన్సర్ శస్త్రచికిత్సల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌లో ఈ పరికరాలను డీఎంఈ బుధవారం ప్రారంభించారు. అమెరికా సాన్‌జోస్ వాస్తవ్యులైన జొన్నలగడ్డ రవిశంకర్, గౌరీలక్ష్మి విరాళంగా ఇందిర, చాగంటి సూర్యనారాయణ పేరు మీద ఈ విలువైన పరికరాలను అందజేయడం శుభపరిణామమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రవికమలకుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, డాక్టర్ శైలజ, డాక్టర్ శైలజారాణి, డాక్టర్లు సత్యవాణి, సమంత్‌కుమార్ ఉన్నారు.

మంత్రి సవితమ్మను కలిసిన అనంతలక్ష్మి దంపతులు



మంత్రికి బొకే ఇస్తున్న దంపతులు

సర్పవరం జంక్షన్, జూలై 17: కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి దంపతులు బుధవారం ఏపీ సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవితమ్మను కలిసి పూలబొకే ఇచ్చి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి వెంట జిల్లా కన్వీనర్ కె.నరసింగరావు, కె.సత్యనారాయణ, ఆర్.రూపేష్‌కుమార్ తదితరులున్నారు.

పరదేశమ్మ ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

తుని రూరల్, జూలై 17: ఎస్.అన్నవరం గ్రామదేవత పరదేశమ్మ ఆలయంలో నూతన కార్యవర్గం కొలువుతీరింది. అధ్యక్షుడిగా నల్లల వరహాలరావు, ఉపాధ్యక్షుడిగా బద్ది కృష్ణ, కార్యదర్శిగా తర్రా దొరబాబు, సహాయ కార్యదర్శిగా రెడ్డి వీరబాబు, కోశాధికారిగా ప్రగడ రమేష్, సహాయ కోశాధికారిగా కర్రి ప్రసన్నకుమార్ ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు అబ్బాయి. మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చోడిశెట్టి త్రిమూర్తుల స్వామి, దూల మాణిక్యం, సకురు నాగేంద్ర నెప్రూ, బోనం చినబాబు, బోడాల జమీల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన

కరప, జూలై 17: అరట్లకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నవోదయ, సైనిక్ స్కూళ్లలో ప్రవేశ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ అవగాహన కల్పించారు. అరట్లకట్ట పాఠశాలలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నారని తెలిపి ప్రణాళికాబద్ధంగా చదివి అర్హత సాధించాలని సూచించారు. సర్పంచ్ గోపి సత్యవేణిగణేష్, ఎంపీటీసీ చల్లా కామేశ్వరి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ నందిపల్లి దేవి, గ్రామపెద్దలు వెలుగుబంట్ల శ్రీనివాస్, బత్తుల సతీష్, ఆయా సబ్జెక్టుల ఫ్యాకల్టీ ఎస్.ధనరాజ్, ఏవీఆర్ నరేష్‌బాబు, వి.గోపాలకృష్ణ, జి.నాగేశ్వరరావు, పి.విజయ్, పి.కిషోర్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడరూరల్, జూలై 17: యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఈనెల 21న కాకినాడ శ్రీనగర్‌లో గల సంస్థ కార్యాలయంలో రేపటి కోసం విద్యార్థులకు ఐఐటీ చదువులు, యువతకు పోటీపరీక్షలు, కెరీర్ గైడెన్స్, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి బుధవారం ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించినట్టు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వాకాడ వెంకటరమణ తెలిపారు. సంస్థ యూత్ ఐకాన్‌గా పంతం సందీప్‌ను ఎంపికచేసారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బాపిరాజు, ఏడుకొండలు, కృష్ణకుమార్, రామకృష్ణ, మంగారావు, ఇందిరాగాంధీ, నీరజా, వెంకటరమణ పాల్గొన్నారు.

పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల ఏర్పాటు

సామర్లకోట, జూలై 17: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఫొటోలను బుధవారం సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ఎన్డీఏ కూటమి నాయకులు తోటకూర శ్రీనివాస్, మార్ని వీరభద్రం, మలకల వెంకటేశ్వరరావు, బండారు రమేష్, కోరుప్రోలు రవీంద్ర, తోటకూర రమేష్ కార్యకర్తలు ఏర్పాటు చేశారు. పలువురు కార్యకర్తలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.

న్యాయం చేయాలని ధర్నా

శంఖవరం, జూలై 17: తన తండ్రి భూవివాదం వల్లే మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని మృతుడు గవర్రాజు కుమారుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గవర్రాజు భూమిని కొందరు ఉద్దేశపూర్వకంగా ఆక్రమించి ఇబ్బందులు గురిచేసిన కారణంగానే మృతిచెందాడని మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అన్నవరం ఎస్ఐ కిషోర్, ప్రత్తిపాడు సీఐ ఆందోళనాకారులతో చర్చించి నిరసన విరమింపచేశారు.

సారా కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు వేలం

ప్రత్తిపాడు, జూలై 17: సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం పాట నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి చెప్పారు. కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎస్ఈబీ స్టేషన్ వద్ద గురువారం ఉదయం 8గంటలకు ఈ వేలం పాటలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

రైతులకు విత్తనాల పంపిణీ

తుని రూరల్, జూలై 17: ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు కోరారు. సర్పంచ్ అత్తి నాగరాజుతో కలిసి రైతులకు గడ్డి, జొన్న విత్తనాలను తేటగుంట పశువుల ఆసుపత్రి వద్ద పంపిణీ చేశారు. పప్పు నవీన్, కె.సత్యనారాయణ, పేరూరి కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

- కిటకిటలాడిన ఆలయాలు
- స్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకాలు
- ప్రత్యేక అలంకరణలు



పిఠాపురంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పుష్పాలతో అలంకారం



కాకినాడ జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలంకరణ దృశ్యం



గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు

పిఠాపురం, జూలై 17: పట్టణంలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానంలో, జైగణేష్ ఆలయం, తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో విశేషపూజలు జరిగాయి. భక్తులు ఆలయాలకు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వైఖానస ఆగమనం ప్రకారం రుక్మిణి,సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ఆలయ అర్చకుడు విజయజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పోర్టుసిటీ(కాకినాడ): నగరంలోని వైష్ణవ ఆలయాల్లో తొలిఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. జగన్నాథపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. దేవాలయం వీధిలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో చాతుర్మాస దీక్ష ప్రారంభాన్ని పురస్కరించుకుని పంచకలశ స్నపన, పంచామృతాభిషేకాలు జరిగాయి. స్వామివారికి అనంతశయన రంగనాథస్వామి అలంకరణ నిర్వహించారు. గాంధీనగర్, వెంకటేనగర్, పాతబస్టాండ్ ఆలయాల్లో ప్రత్యేక అలంకరణ చేశారు. భానుగుడి ఉషారాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి.

తొండంగి: ఏవినగరంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి పత్రి పూజలు జరిపారు. ప్రత్యేక పదార్థాలను నివేదించారు. శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు,విజయలక్ష్మి దంపతులు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ, అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. అనంతరం యనమల దంపతులు షిర్డీ సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వారి వెంట కొయ్యా శ్రీనుబాబు, మాజీ ఎంపీపీ యనమల కృష్ణ, యనమల నాగేశ్వరావు, అరిగెల నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

కాకినాడరూరల్: మండలంలోని చీడిగలోని దశావతార వేంకటేశ్వరస్వామి ప్రత్యేక రూపంలో దర్శనమిచ్చారు. సుమారు రూ.20వేల రూపాయి నాణేలతో అలంకరించారు. ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ఇంద్రపాలెంలోని శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, సీతారామస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆటంకం కలుగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తి గ్రామంలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో స్వయంగా పంచామృత సహిత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపించారు. తొలిఏకాదశి రోజున నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించడం వల్ల పాడిపంటలు సమృద్ధిగా ఉండి సుఖసంతోషాలతో ఉంటారని ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు తెలిపారు.

కరప: కరప వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధానార్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణలు స్వామివారిని తులసీమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. వేళంగిలో ఏడడుగుల వెంకటేశ్వర స్వామి, కూరాడలో వేణుగోపాలస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు చేశారు. యండమూరులో ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్లకు పూజలు చేశారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ధర్మవరం, ఉత్తరకంచిలో వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు,కుంకుమార్చనలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొత్తగా దంపతులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లారు.

ఏలేశ్వరం: పట్టణంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి, వైష్ణవ, ఆలయాలు పూలతో అలంకరించి పురోహితులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామాలయాల్లో భజనలు చేశారు.

పెద్దాపురం: మండల పరిధిలోని తిరుపతి శృంగార వల్లభస్వామి, కట్టమూరు కేశవ పట్టాభిరామస్వామి, జి.రాగంపేట వేణుగోపాలస్వామి, పెద్దాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

సామర్లకోట: సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో.. సామర్లకోట మెహెర్ కాంప్లెక్స్ వద్ద లక్ష్మీగణపతి ఆలయంలో వీరవెంకట సత్య నారాయణస్వామి, అనంత లక్ష్మీదేవి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కాకినాడ రూరల్: రూపాయి నాణేలతో వేంకటేశ్వరునికి అలంకరణ



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక అలంకరణ

కార్యకర్తల ఆరోగ్య పరిరక్షణ జనసేన బాధ్యత

జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల బాబు

పెద్దాపురం, జూలై 17: జనసేన కార్యకర్తల ఆరోగ్య పరిరక్షణపై పార్టీ ఎంతో బాధ్యతతో ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమ నిర్వహణకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18 నుంచి 28 వరకూ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యకర్తలు రూ.500 చెల్లించి రూ.5 లక్షల వరకూ ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కార్యకర్త ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పోలమరశెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గణేష్, తమనార లక్ష్మణ దివాకర్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం : మర్రెడ్డి



చేబ్రోలులో ప్రజలతో మాట్లాడుతున్న మర్రెడ్డి

గొల్లప్రోలు రూరల్, జూలై 17: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం రాణాసెంటర్‌లోని డంపింగ్‌యార్డు, అక్కడ ఏర్పాటు చేయబోయే అన్నక్యాంటీన్, మార్కెట్‌సెంటర్‌లోని డంపింగ్‌యార్డు, శిథిలావస్థలో ఉన్న ఓవర్‌హెడ్ రిజర్వాయర్లను ఆయన బుధవారం పరిశీలించారు. నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, చల్లా నూకరాజు(చినబాబు), జనసైనికులు ఉన్నారు.

బంగారు హారం బహూకరణ



పిఠాపురంలో హారం అందజేస్తున్న దాతలు

పిఠాపురం, జూలై 17: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి దాతలు బంగారు హారం బహూకరించారు. కుసుమించి వెంకటరమణమూర్తి, గుణరత్నం దంపతులు, కామేశ్వరరావు, రత్నమాధవి, వీర్రాజు, లలిత దంపతుల సహకారంతో రూ.లక్షతో బంగారు శంఖుచక్రాల లాకెట్‌తో కూడిన హారాన్ని బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు విజయజనార్ధనాచార్యులకు అందజేశారు. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, కప్పల సత్యనారాయణ, బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహానికి నివాళి

పిఠాపురం, జూలై 17: పట్టణంలో ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జగ్గయ్యచెరువు కాలనీ బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో ఉన్న ఏకలవ్యుని విగ్రహానికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, పలువురు నాయకులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు, జనసైనికులు వేర్వేరుగా పూలమాలలు వేసి వేర్వేరుగా నివాళులర్పించారు. జిల్లా ఎరుకుల సంఘం అధ్యక్షుడు భారతి వీరబాబు ఆధ్వర్యంలో అర్బన్ బ్యాంకు ఛైర్మన్ బాలిపల్లి రాంబాబు, భారత నాగేశ్వరరావు, అమలదాసు నాగన్న, సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు వేశారు.

టీడీపీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలి

పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల



తుని రూరల్: మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, జూలై 17: ఒకే మాట ఒకే బాటతో పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయం నందు ఎమ్మెల్యే దివ్య అధ్యక్షతన నియోజకవర్గం టీడీపీ వర్కింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. యనమల మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రజా అవసరాలకనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని, ప్రాధాన్యత ప్రకారం అన్ని పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు పెదిరెడ్డి చిట్టిబాబు, సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి అబ్బాయి, ఇనుగంటి సత్యనారాయణ, మళ్ల గణేష్, నార్ల రత్నాజీ, కుసుమంచి సత్యనారాయణ, కొయ్యా శ్రీనుబాబు, గాడి రాజుబాబు, కోతల సూరిబాబు, చిటికెల శ్రీనివాసరావు, కొయ్యా కేశవులు, కొయ్యా సూరిబాబు, అంకం రెడ్డి రమేష్ పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనే లక్ష్యం

కోటనందూరు, జూలై 17: పేదరికం నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం మండలంలోని జగన్నాధపురంలో ఎమ్మెల్యే యనమల దివ్యకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితిని జగన్ అధోగతి పాలు చేశారని, దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెట్టేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టారన్నారు. ట్రాక్టర్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే దివ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, లోవ దేవస్థానం ఛైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, యర్ర చినసత్యనారాయణ, మాతిరెడ్డి భాస్కర్‌రావు, మాతిరెడ్డిబాబులు, గుడివాడ అప్పలనాయుడు మాస్టారు, పెంటకోట బాస్కర్ సత్యనారాయణ, గుడివాడ నాని, గొర్లి రాజు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్యే వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జూలై 17: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా సమావేశం జరిగింది. వర్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో పాటు అడుగడుగునా వేధించారని, కూటమి ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి ఉండదని తెలిపారు. ప్రభుత్వం అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తుందని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ చెరుకూరి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేసి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దామన్నారు. సంఘంలోని ఎంటీఎస్ ఉపాధ్యాయులు, కాంట్రాక్టు లెక్చరర్లు, కేజీబీవీ వొకేషనల్, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాన్ని కోరదామని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ గౌరవాధ్యక్షుడిగా కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అధ్యక్షుడిగా తమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా వడగ సూరిబాబు, ఆర్థిక కార్యదర్శిగా ఎం.కొండలరావు, అసోసియేట్ అధ్యక్షులుగా స్వర్ణలత, వి.పేర్రాజు, ఉపాధ్యక్షులుగా కె.మోహన్, మేడిశెట్టి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శిగా కసా రమణమూర్తి, ఎంటీఎస్, ఎంఐఎస్ కన్వీనర్లుగా కేజీకే చౌదరి, ఏ.బాలగణేష్ ఎన్నికయ్యారు.

సిమెంట్ శ్లాబ్‌లను తొలగించాలి : కమిషనర్



డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17: డ్రైనేజీలపై సిమెంట్ శ్లాబ్‌లు వేసి ఆక్రమిస్తున్న తీరుపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మిలిటరీ రోడ్డులోని చీడీలపొర డ్రైన్, డీమార్ట్ ప్రాంతంలోని డ్రైనేజీల వద్ద పూడికతీత పనులను పర్యవేక్షించారు. చీడిల పొర వద్ద ప్రధాన డ్రైనేజీలో గుర్రపుడెక్క పేరుకుపోవడాన్ని గుర్తించి 2,3 రోజుల్లో తొలగింపు చర్యలు తీసుకోవాలన్నారు. డీమార్టు ప్రాంతంలో కొంతమంది డ్రైనేజీలపై సిమెంట్ శ్లాబ్‌లు వేయడంపై మండిపడ్డారు. వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే తామే తొలగించి చార్జీలు వసూలు చేస్తామని పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లోని నమ్మటాయిలెట్స్‌ను పరిశీలించి నిర్వహణ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ఆయన వెంట డీసీపీ హరిదాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు ఉన్నారు.

రెండో దశ ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17: రెండో దశ ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా పద్మప్రియ థియేటర్ జంక్షన్ నుంచి 1వ టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు గుర్తించామని కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. మొదటిదశలో భానుగుడి జంక్షన్ నుంచి ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా చేశామన్నారు. ఈనెల 21సాయంత్రంలోగా స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే 22న ఉదయం నుంచి నగరపాలక సంస్థ సిబ్బందితో హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించి ఖర్చు సంబంధితుల నుంచి వసూలు చేస్తామన్నారు.

పోలీస్ అవుట్‌పోస్టు ప్రారంభం



కాట్రావులపల్లిలో అవుట్‌పోస్టును ప్రారంభిస్తున్న డీఎస్పీ

జగ్గంపేట రూరల్, జూలై 17: మండలంలోని కాట్రావులపల్లిలో పోలీస్ అవుట్‌పోస్టును పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి బుధవారం ప్రారంభించారు. ఇటీవల తరుచూ కాట్రావులపల్లిలో ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో అవుట్‌పోస్టును ప్రారంభించినట్టు తెలుస్తుంది. దీంతో పరిస్థితులు అదుపులోకి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్ఐ కె.బలరాం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పాదగయ క్షేత్రంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

పాదగయలో ఎమ్మెల్యే దాట్ల పూజలు

పిఠాపురం, జూలై 17: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబురాజు బుధవారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యంపై వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఎమ్మెల్యేను కార్యనిర్వహణాధికారి, సహాయకమిషనరు దుర్గా భవానీ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

తాళ్లరేవు, జూలై 17: కోరింగ పంచాయతీ సీతారామపురం టీడీపీ కార్యకర్త బొక్కా వెంకటేశ్వరరావు భౌతికకాయానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు బుధవారం నివాళిలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, వెంటపల్లి చంద్రమౌళి, టేకుమూడి సత్యనారాయణ, అత్తిలి బాబూరావు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

'బాలల హక్కులను పరిరక్షించాలి'

పెద్దాపురం, జూలై 17: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక జవహర్ నవోదయా విద్యాలయాన్ని ఆమె బుధవారం సందర్శించి బాలబాలికలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారికి అందుతున్న సౌర్యాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, టి.రామలక్ష్మి, జగన్మోహన్‌రావు, సత్యనారాయణ, సనపల సత్యనారాయాణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు, జూలై 17: చొల్లంగి ఎంపీటీసీ గర్రే సాయిమహాలక్ష్మీ నివాసంలో లవింగ్ హేండ్స్ డిజబుల్డ్ సొసైటీ, సత్యా ఆయుర్వేద క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఎల్‌బీ.ప్రసాద్ నేత్ర ఆసుపత్రి వైద్యులు బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 80మందికి నేత్ర పరీక్షలు చేసి 20మందికి ఆపరేషన్లు చేసేందుకు సిద్ధం చేశారు. బొడ్డు సత్యానందం, చేయూత సంస్థ డైరెక్టర్ మొండి రవి తదితరులు ఉన్నారు.

అఖిల సంజనకు గోల్డ్‌మెడల్

రౌతులపూడి, జూలై 17: గ్రామానికి చెందిన గాలి అఖిల సంజన బయాథలన్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. బీఎస్సీ పారినిక్స్ చదువుతున్న సంజన ఈనెల 16 కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథ లాన్, బయాథలన్, ట్రయాథలన్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది.

తమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, జూలై 17: కాకినాడలో వాగు రమేష్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్ ఉన్నారు.